
వీధి దీపం.. కొండెక్కింది!


శారద కాలనీలో దీపం లేని స్తంభం

పరిశీలన

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : విద్యుత్తు స్తంభాలకు ఏర్పాటు చేసిన దీపాలు చెడిపోతే.. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలి. వనపర్తి పురపాలక సంఘంలో మరమ్మతులు చేసి అమర్చే దుస్థితి నెలకొంది. కొత్తవి ఏర్పాటు చేయాలని ఆయా కాలనీవాసులు అధికారులను కోరుతున్నా స్పందన కరవైంది. వీధి దీపాల నిర్వహణకు ఈఈఎస్ఎల్ కంపెనీతో చేసుకున్న ఒప్పందం ఈ ఏడాది ఫిబ్రవరితో ముగిసింది. అప్పటి నుంచి నిర్వహణను పురపాలిక అధికారులు, పాలకవర్గం పట్టించుకోవడం లేదు. అధికారులు కొత్త విద్యుత్తు దీపాల కొనుగోలుకు ఆసక్తి చూపక పోవడంతో పట్టణంలో పలు కాలనీల్లో అంధకారం నెలకొంది.

రూ.10 లక్షలు ఏపాటికి?

వనపర్తి పురపాలిక పరిధిలో గతంలో 8 వేల వీధి దీపాలు ఏర్పాటు చేశారు. శివారు కాలనీలు, పలు ప్రధాన రహదారులు, అంతర్గత వీధుల్లో ఏడాది నుంచి 1,350 స్తంభాలకు వీధి దీపాలు లేవు. వీటి ఏర్పాటుకు రూ.40 లక్షలు అవసరమవుతాయని పుర అధికారులు అంచనా వేశారు. పాలకవర్గం రూ.10 లక్షలు కేటాయించి చేతులు దులుపుకొంది. రూ.10 లక్షలు 350 దీపాలకు మాత్రమే సరిపోతాయి.

● పట్టణంలోని లక్ష్మీనరసింహకాలనీలో 50 స్తంభాలు, నాగవరం, కండక్టర్ కాలనీల్లో 50, రాంనగర్‌కాలనీలో 100 దీపాలు, రాయిగడ్డలో 18, పీర్లగుట్టలో 30, నర్సింగాయపల్లిలో 30, బాలానగర్‌లో 20, భగత్‌సింగ్‌నగర్‌లో 25, చౌడేశ్వరి దేవాలయం సమీపంలో 25 స్తంభాలకు, ఇతర కాలనీల్లో 10 నుంచి 25 స్తంభాలకు దీపాలు లేవని పుర సిబ్బంది చెబుతున్నారు.

రూ.30 లక్షలు కేటాయిస్తాం..

కొత్త దీపాల ఏర్పాటుకు ఇటీవల రూ.10 లక్షలు కేటాయించాం. ఆయా కాలనీల్లో వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. త్వరలో రూ.30 లక్షలు కేటాయించి ప్రతి స్తంభానికి దీపాలు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరిస్తాం.

- పూర్ణచందర్, పుర కమిషనర్, వనపర్తి

పన్ను చెల్లిస్తున్నా.. అభివృద్ధి ఏదీ?

ప్రధాన రహదారులతో పాటు శివారు ప్రాంతాల అభివృద్ధికి పాలకవర్గం, అధికారులు దృష్టి సారించడం లేదని విమర్శ ఉంది. పన్ను చెల్లిస్తున్నా అభివృద్ధి పనులు చేయడం లేదని పురవాసులు ఆరోపిస్తున్నారు. సకాలంలో పన్ను చెల్లించాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని, వారి దృష్టికి సమస్య తీసుకెళ్తే స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీటి దీపాలు లేక దొంగల బెడదతో భయాందోళనలకు గురవుతున్నామని చెబుతున్నారు. అంధకారంలోనే పండగ చేసుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని ఆవేదన చెందుతున్నారు.

వనపర్తిలో పరిస్థితి ఇది..

- 33 వార్డులు
- 9,350 విద్యుత్తు స్తంభాలు
- 1,350 వీధి దీపాలు లేని స్తంభాలు
- రూ.40 లక్షలు ఏర్పాటుకు అంచనా

8 యూనిట్లతో విద్యుదుత్పత్తి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : జూరాల జలాశయం నుంచి విద్యుదుత్పత్తికి 22,801 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్న నేపథ్యంలో ఎనిమిది యూనిట్ల నుంచి ఉత్పత్తి కొనసాగిస్తున్నారు. గడిచిన 24 గంటల్లో ఎగువన నాలుగు యూనిట్ల నుంచి 2.324, దిగువన నాలుగు యూనిట్ల నుంచి 2.636 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగిందని జెన్‌కో ఎస్ఈ (ఓఅండ్ఎం) సూరిబాబు తెలిపారు.

ఆరోగ్యంపై దృష్టి సారించండి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ విధులతో పాటు ఆరోగ్యంపై దృష్టి సారించాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి సూచించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆరోగ్యంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎంహెచ్‌వో జయచంద్రమోహన్ ఆరోగ్యం ప్రాముఖ్యత, జీవనశైలి, ఆహారపు అలవాట్ల గురించి చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ నిత్యం వ్యాయామం కోసం కొంత సమయం కేటాయించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్ మాట్లాడుతూ శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.


ఆకాశం.. ఈ నీటిలో..

ప్రకృతి కనువిందు చేస్తోంది. పచ్చదనానికి తోడు నీలాకాశంలో పాల నురగలాంటి తెల్లటి మబ్బులు అటూ ఇటూ కదులుతూ మనసు దోచేస్తున్నాయి. మహబూబ్‌నగర్ పురపాలక పరిధి బోయపల్లి శివారు హనుమాన్ చెరువు నీటిలో అందంగా ప్రతిబింబిస్తున్న మేఘాలను 'ఈనాడు' తన కెమెరాలో బంధించింది.

- ఈనాడు, మహబూబ్‌నగర్

ఊరూరా బతుకమ్మ వేడుక


వనపర్తిలో భారత జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో..

వనపర్తిగ్రామీణం, న్యూస్‌టుడే : తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే పండగ బతుకమ్మనని భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి గీత అన్నారు. గురువారం వనపర్తి అంబేడ్కర్ చౌరస్తాలో బతుకమ్మ వేడుకలను భారత జాతీయ మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంతకుముందు సీపీఐ కార్యాలయం నుంచి బతుకమ్మలను ప్రదర్శనగా తీసుకొచ్చారు. అనంతరం చౌరస్తాలో బతుకమ్మ పాటలు పాడుతూ బొడ్డెమ్మలు వేశారు. కార్యక్రమంలో నాయకురాలు కళావతమ్మ, కృష్ణవేణి, జయమ్మ, సీపీఐ జిల్లా కార్యదర్శి శ్రీరామ్, పట్టణ కార్యదర్శి రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

పాన్‌గల్, న్యూస్‌టుడే : బతుకమ్మ సంబరాల్లో భాగంగా గురువారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ, కార్యాలయ సిబ్బంది బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పూలతో ముస్తాబు చేసిన బతుకమ్మలను కార్యాలయ ఆవరణలో పెట్టి ఆట ఆడారు. అనంతరం సమీపంలోని పొల్కిచెరువులో వదిలారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోవిందరావు, ఎంపీవో రఘురాములు, సీనియర్ అసిస్టెంట్ వరమ్మ, ఏపీవో కురుమయ్య, ఈసీ, టీఏలు పాల్గొన్నారు.


మానాజిపేటలో బతుకమ్మ వద్ద మహిళలు, యువతులు

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే : మండలంలోని మానాజిపేట గ్రామంలో గురువారం రాత్రి గ్రామ సైనిక్ యువజన కమిటీ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు జరుపుకొన్నారు. మహిళలు మహిళలు బొడ్డెమ్మ వేశారు.

సార్లు.. కుర్చీలు వదలట్లే!

అక్రమ ఇసుక రవాణాలో పోలీసుల తీరిది

వీఆర్‌కు వెళ్లకుండా పెద్దఎత్తున పైరవీలు




వంగూరు : ఉల్పర సమీపంలో నిల్వ చేసిన ఇసుకను టిప్పర్లలో నింపుతున్న పొక్లెయిన్ (పాతచిత్రం)

మహబూబ్‌నగర్, ఈనాడు : ఉమ్మడి జిల్లాలో అక్రమార్కులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులకు ఇసుకే కాసుల కురిపించే కల్పవృక్షంగా మారింది. ఏ పార్టీ అధికారంలోకి ఆ పార్టీ నాయకులు దీన్నే సంపాదనా మార్గంగా ఎంచుకుంటున్నారు. సహజంగానే వీరికి అధికారులు వంతపాడుతూ స్వామికార్యం, స్వకార్యం కానిచ్చేస్తున్నారు. అలాంటి వారిపై ఎట్టకేలకు తొలిసారిగా ఉన్నతాధికారులు తీవ్రంగా స్పందించారు. ఇసుక అక్రమ రవాణా కట్టడిలో విఫలమయ్యారంటూ ఇటీవల ఉమ్మడి జిల్లాలో పలువురు ఎస్‌ఐలను వేకెన్సీ రిజర్వ్(వీఆర్)లో పెట్టారు. ప్రభుత్వం బాగా స్పందిస్తోందని అందరూ అనుకున్నారు. తీరా చూస్తే వేటుపడిన సార్లే వరూ కాసులు గలగలలాడే సీట్లను వదట్లేదు.

పెద్ద తలకాయల అండదండలు : ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంలో నిర్లక్ష్యం వహించినందుకు ఉమ్మడి జిల్లాలోని వంగూరు, ఉప్పునుంతల, బిజినేపల్లి, తెలకపల్లి, వీపనగండ్ల ఎస్‌ఐలపై వేటు వేశారు. ఇందులో వీపనగండ్ల ఎస్‌ఐని ఇటీవలే బదిలీ చేశారు. మిగతా నాలుగు స్టేషన్ల ఎస్‌ఐలు మాత్రం కదలట్లేదు. రాష్ట్ర మల్టీజోన్-2 ఐజీపీ సత్యనారాయణ గత గురువారం వేటు వేసినా ఆ ఠాణాల్లోనే విధులు నిర్వహిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. తమ అక్రమ రవాణా దందాకు బాగా సహకరించే అధికారులు ఆయా ఠాణాల నుంచి వెళ్లకుండా నాయకులు పెద్దఎత్తున పైరవీలు సాగిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి జిల్లాకు చెందిన ఓ ముఖ్య ప్రజాప్రతినిధి సోదరుడే నేరుగా రంగంలోకి దిగి వేటు పడిన ఎస్‌ఐలను వీఆర్‌కు పంపించకుండా చక్రం తిప్పినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

సీఎం సొంత జిల్లాలోనే ఇలా.. : నాగర్‌కర్నూల్ జిల్లాలోని దుందుభి పరిధిలో అక్రమ ఇసుక రవాణా కొన్నేళ్లుగా పెద్దఎత్తున నడుస్తోంది. సీఎం సొంత జిల్లాలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛ సాగటంతో విమర్శలు, ఆరోపణలు వచ్చాయి. దీన్ని తీవ్రంగా పరిగణిస్తూ ఉన్నతాధికారులు పలువురు పోలీసులపై వేటు వేయడంపై ఉమ్మడి జిల్లావ్యాప్తంగా హర్షం వ్యక్తమైంది. తర్వాత ఏమైందో వీఆర్‌లో పెట్టిన ఎస్‌ఐలు ఇక్కడే విధుల్లో కొనసాగటం అందరినీ విస్తుగొల్పుతోంది. ఎస్‌లు వీఆర్‌కు వెళ్లేందుకు జిల్లా అధికారుల నుంచి కౌంటర్ డిపార్ట్‌మెంటల్ ఉత్తర్వులు వెలువడకుండా నేతలు చక్రం తిప్పుతున్నట్లు సమాచారం. పోలీసులపై వేటు వేసినా అమలు కాకపోతుండటంతో ఇసుకాసురులు మరింత రెచ్చిపోతున్నారు. నాగర్‌కర్నూల్ ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌ను 'ఈనాడు' సంప్రదించగా చర్యలు చేపడతామన్నారు.

లక్ష్యం నిర్దేశించుకుని వసూళ్లు.. : నెలనెలా భారీ స్థాయిలో మామూళ్లు వచ్చే ఇసుక లభించే ప్రాంతాల్లో సీఐలు, ఎస్సైలు, తహసీల్దార్ పోస్టులకు తీవ్రమైన డిమాండ్ ఉంటోంది. రూ.లక్షలు చెల్లించి ఇక్కడ పోస్టింగు వేయించుకుంటున్న అధికారులు లక్ష్యం నిర్దేశించుకుని మరీ వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పారే దుందుభి వాగు ఉన్న పలు ఠాణాల్లో ప్రతి ట్రాక్టర్‌పై నెలకు రూ.15వేల నుంచి రూ.20వేల వరకు వసూలు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అందుకే వాగులు, నదుల పరీవాహక ప్రాంతాల నుంచి వెళ్లడానికి అధికారులకు ఏమాత్రం ఇష్టముండదని అంతా చెబుతుంటారు.

967 మందికి నియామక పత్రాలు

పెండింగ్‌లో మరో 164


హైదరాబాద్‌లో నాగర్‌కర్నూల్ డీఈవో గోవిందరాజులు చేతుల మీదుగా నియామక పత్రం అందుకుంటున్న హరీశ్

అచ్చంపేట, న్యూస్‌టుడే : డీఎస్సీలో ఫలితాల్లో ఉపాధ్యాయ పోస్టులకు అర్హత సాధించిన అభ్యర్థులకు హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేసిన విషయం తెలిసిందే. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 1,131 ఖాళీలకుగాను 967 మందికి నియామక పత్రాలు ఇచ్చారు. ధ్రువపత్రాల తిరస్కరణ, రిజర్వేషన్లు, రోస్టర్ పాయింట్లు, స్పెషల్ ఎడ్యుకేటర్ల కోర్టు కేసులు తదితర కారణాలతో 164 పోస్టులను పెండింగ్‌లో ఉంచారు.

ఉమ్మడి జిల్లాలో...

జిల్లా	ఖాళీలు	భర్తీ	మిగులు
మహబూబ్‌నగర్	243	214	29
నాగర్‌కర్నూలు	285	226	59
జోగులాంబ గద్వాల	172	149	23
వనపర్తి	152	126	26
నారాయణపేట	279	252	27

కోర్టు కేసులతో నిలిచిపోయినవి 113...

స్పెషల్ ఎడ్యుకేటర్ల ఎస్జీటీ పోస్టులు ఉమ్మడి జిల్లాలో 113 ఉన్నాయి. వారికి టెట్ అవసరం లేదని కొందరు అభ్యర్థులు కోర్టులో కేసు వేయడంతో వాటి భర్తీని నిలిపేశారు. దీంతో మహబూబ్‌నగర్ జిల్లాలో 20, నాగర్‌కర్నూలులో 41, జోగులాంబ గద్వాలలో 17, నారాయణపేటలో 16, వనపర్తి జిల్లాలో 19 ఖాళీగా ఉన్నాయి. అయితే స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేటర్ పోస్టులు 34కుగాను 20 భర్తీ చేయగా 14 ఖాళీలు మిగిలున్నాయి. దీంతో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేటర్‌ల పోస్టుల ఖాళీలు సంఖ్య 127గా ఉంది. మరోవైపు ఉపాధ్యాయ పోస్టులు 37 భర్తీ కాలేదు. ఈ 37లో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 11, భాషా పండితులు 7, ఎస్జీటీ 18, పీఈటీ ఒకటి చొప్పున ఉన్నాయి.

వెబ్ ఆప్షన్ల విధానంలో...

జిల్లాల వారీగా ఉపాధ్యాయ ఖాళీల వివరాలను త్వరలో ప్రకటిస్తారు. దీన్ని ఆధారంగా ఎంపికైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. మెరిట్, రోస్టర్ పాయింట్ల ఆధారంగా వెబ్ ఆప్షన్లను పరిగణనలోకి తీసుకొని పాఠశాలలను కేటాయిస్తారు. దసరా సెలవుల అనంతరం పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి ఈ ప్రక్రియ పూర్తవుతుందని అంచనా.

ఆదేశాల ప్రకారం చర్యలు

మిగిలిపోయిన ఖాళీల విషయంలో ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటాం. త్వరలో అధికారుల ఆదేశాలతో అభ్యర్థులకు పాఠశాలలను కేటాయిస్తాం.

- గోవిందరాజులు, డీఈవో, నాగర్‌కర్నూల్

మహాగౌరీదేవి నమోస్తుతే



అలంపూర్, న్యూస్‌టుడే: జోగులాంబ అమ్మవారు గురువారం మహాగౌరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దర్బారు సేవలో కొలువు నిర్వహించి కుమారి సవాసిని పూజలు, మహామంగళ హారతి, మంత్రపుష్పాలు నిర్వహించారు.

నేరాల నియంత్రణలో సఫలీకృతమవ్వాలి


ఆయుధపూజ చేస్తున్న ఎస్పీ రావుల గిరిధర్, సతీమణి అపర్ణ

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా నేరాలు నియంత్రించడంలో జిల్లా పోలీసు శాఖ సఫలీకృతమవ్వాలని ఎస్పీ రావుల గిరిధర్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సాయుధ దళ కార్యాలయంలో ఎస్పీ, ఆయన సతీమణి ఆయుధ పూజ చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ యంత్రాంగం ప్రజలకు అందుబాటులో ఉండి ఉత్తమ సేవలందించి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సాయుధ దళ అదనపు ఎస్పీ వీరారెడ్డి, డీఎస్పీ వెంకటేశ్వరరావు, సాయుధ దళ సీఐ శ్రీనివాస్, ఆర్ఐ అప్పలనాయుడు, వనపర్తి సీఐ నాగభూషణంరావు, జిల్లాలోని ఎస్సైలు, సాయుధ దళ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తి చేయండి


అధికారులతో సమావేశమైన అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ ప్రక్రియను తర్వితగతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో పురపాలిక అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు ఎన్ని పరిష్కరించారు.. పెండింగ్‌లో ఉన్న వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రూపొందించిన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. స్వశక్తి మహిళా సంఘాలకు ప్రస్తుత సంవత్సరం నిర్దేశించిన లింకేజీ రుణాలను సకాలంలో అందించాలన్నారు. పుర కమిషనర్ పూర్ణచందర్, పలువురు అధికారులు పాల్గొన్నారు.


సిరులు కురిపించిన విరులు

పండగ వేళ ఉమ్మడి జిల్లాలో రూ.10 కోట్ల వరకు వ్యాపారం


మహబూబ్‌నగర్ : గడియారం చౌరస్తాలో బతుకమ్మలను కొనుగోలు చేస్తున్న మహిళలు

న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ సాంస్కృతికం : ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా పూలనే దేవతగా కొలిచే గొప్ప పండగ బతుకమ్మ. ప్రకృతి ఆరాధనకు, తెలంగాణ విశిష్ట సంస్కృతికి ప్రతీక. మహిళలకు సహజంగానే పూలంటే ఇష్టం. అలాంటిది పూలతో తయారు చేసే బతుకమ్మ పండగ, అందులోనూ అమ్మవారి వేడుక కావటంతో అతివల ఆనందానికి అవధులుండవు. పల్లెలు, పట్టణాల్లోని మహిళలు, యువతులు నిత్యం వర్ణరంజితమైన రకరకాల పూలతో బతుకమ్మలు తయారు చేస్తూ ఆనందంగా ఆడిపాడారు. కొందరు మహిళలు మార్కెట్‌లో కొనుగోలు చేసిన పూలతో బతుకమ్మలను తయారు చేశారు. మరికొందరు పూల వ్యాపారులు తయారు చేసే బతుకమ్మలనే కొనుగోలు చేశారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పూల వ్యాపారం బాగా సాగింది. తంగేడు, గునుగు, బంతులు, చేమంతి, గులాబీలు తదితరాలకు మార్కెట్‌లో భారీ ధర పలికింది. రైతులు, వ్యాపారులు లాభపడ్డారు.

భారీఎత్తున దిగుమతి : బతుకమ్మలకే కాకుండా దుర్గామాత ప్రతిమలు, మండపాల అలంకరణ, పూజల్లో పూలను ఎక్కువగా వాడటంతో ధరలు భారీగా పెరిగాయి. బంతి పూలు, గులాబీలు స్థానిక రైతులు పండించినవే. ఇతర పూలను మాత్రం ఉమ్మడి జిల్లాలోని వ్యాపారులు హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, రాయచూర్, చెన్నై, కర్నూల్ ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. గులాబీ పూలకు కిలో రూ.450, రూ.500 వరకు ధరలు పలికాయి. మార్కెట్లో పిడికెడు తంగేడు మొగ్గలు, ఆకులకు రూ.10 తీసుకున్నారు. ఒక మోస్తరు బతుకమ్మ తయారీకి అవసరమైన తంగేడు కోసమే రూ.200 ఖర్చయ్యింది. రూ.50లకు మూడు కట్టల పట్టుకుచ్చులు ఇచ్చారు. చిన్న గునగుపూల మోపునకు రూ.100 తీసుకున్నారు. చామంతి వంద గ్రాములకే రూ.30, పోకబంతులకు రూ.50, కిలో బంతిపూలు రూ.80, రూ.100 ధర పలికాయి. ఇతర పూలు, గౌరమ్మ ప్రతిమ, కలువలకు రూ.150 కావాల్సిందే. వ్యాపారులు తయారు చేసిన చిన్న బతుకమ్మనే రూ.500లకు అమ్ముతున్నారు. సొంతంగా బతుకమ్మ తయారు చేసుకోవాలంటే రూ.800ల వరకు ఖర్చయ్యింది. ఈ పండగకు ఉమ్మడి జిల్లాలో రూ.10 కోట్ల వరకు పూల వ్యాపారం జరిగిందని అంచనా.



మాకు ఇప్పుడే పెద్ద గిరాకీ : పూల వ్యాపారులకు ఈ సమయంలో మంచి గిరాకీ ఉంటుంది. దుర్గామాత అలంకరణ, బతుకమ్మల తయారీకి రకరకాల పూలు కొనుగోలు చేస్తారు. మహబూబ్‌నగర్‌లో పెద్ద పూల దుకాణాలు 21 ఉన్నాయి. పట్టణంలోని చిన్న, పెద్ద దుకాణాల్లో కలిపి ఈ సీజన్‌లో రోజుకు రూ.2 లక్షలకు పైగా వ్యాపారం సాగింది. మహబూబ్‌నగర్ పట్టణం, జడ్చర్ల, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, వనపర్తి, గద్వాల, అలంపూర్, నారాయణపేట, దేవరకద్ర, కొత్తకోట, మరికల్, కోస్గి, కొడంగల్, మహ్మదాబాద్ తదితర ప్రాంతాల్లో ఈ 10 రోజుల్లో రూ.10 కోట్లకు పైగా పూల కొనుగోళ్లు జరుగుతాయని అంచనా.

- అప్సర్, పూల వ్యాపారి, మహబూబ్‌నగర్



ధరలు పెరిగినా కొనుగోలు చేశాం : మహిళలకు దుర్గా నవరాత్రి ఉత్సవాలు, బతుకమ్మ వేడుకలు ఎంతో ప్రత్యేకం. పూలధరలు పెరిగినా బతుకమ్మపై భక్తితో తప్పకుండా కొనుగోలు చేస్తాం. బతుకమ్మ తయారీ కోసం పూలకే రూ.700 వరకు ఖర్చు చేశాం.

- వెంకటేశ్వరమ్మ, వేంకటేశ్వరకాలనీ, మహబూబ్‌నగర్

వీరుల గాథలు తెలుసుకునేలా..

విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పోటీలు



వీర్ గాథా వెబ్‌పేజీ

న్యూస్‌టుడే, గద్వాల న్యూటౌన్

విద్యార్థి స్థాయి నుంచే దేశభక్తిని పెంపొందించడానికి దేశం కోసం ప్రాణాలర్పించిన వీరుల గాథలు తెలియజేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పోటీలను నిర్వహిస్తోంది. రక్షణ, విద్యా మంత్రిత్వ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరానికి 'వీర్ గాథ-4.0' పేరుతో వీటిని నిర్వహిస్తోంది. ఈ మేరకు ఇప్పటికే ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో పాటు, వీసీలు నిర్వహించి సూచనలు చేశారు.

3 నుంచి ఇంటర్ తరగతులకు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3,227కి పైగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, 210కి పైగా జూనియర్ కళాశాలలున్నాయి. వీటిలో 3వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనవచ్చు. అక్టోబరు 15వ తేదీనాటికి సంబంధిత పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలి. 17 నుంచి నవంబరు 10 వరకు జిల్లా స్థాయి, నవంబరు 12 - 30 మధ్య రాష్ట్ర స్థాయి, డిసెంబరు 4 - 24 మధ్య జాతీయ స్థాయి పోటీలుంటాయి. ఆసక్తి ఉన్న విద్యార్థులు mygov.in వెబ్‌పేజీలో వీర్ గాథా ఆప్షన్ క్లిక్ చేసి వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది.

సూపర్ 100 విజేతలు

వీర్‌గాథా పోటీలో ఒక స్థాయిలో ఎంపికైన వారిని, మరో స్థాయిలో ఎంపిక చేయకుండా వేర్వేరు విద్యార్థులను ఎంపిక చేస్తారు. జిల్లా స్థాయి పోటీలలో నలుగురిని విజేతలుగా, రాష్ట్ర స్థాయి పోటీలలో 8 మందిని విజేతలుగా గుర్తిస్తారు. ఇక జాతీయ స్థాయి పోటీలలో 100 మందిని విజేతలుగా ప్రకటిస్తారు. వీరిని సూపర్-100 విజేతలుగా పిలుస్తారు. 3 నుంచి 5 వరకు 25 మంది, 6 నుంచి 8 వరకు 25 మంది, 9, 10వ తరగతి నుంచి 25 మంది, ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం నుంచి 25 మందిని ఎంపిక చేస్తారు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలలో సత్కారం, ధ్రువపత్రం అందిస్తారు. జాతీయ స్థాయి విజేతలకు విద్యా మంత్రిత్వ శాఖ, రక్షణ మంత్రిత్వ శాఖ వారు రూ.10 వేల చొప్పున నగదును అందజేస్తుంది.

తరగతుల వారీగా..

- 3 నుంచి 5వ తరగతి విద్యార్థులు 150 పదాలకు మించకుండా 'నా రోల్ మోడల్' అనే పేరుతో గ్యాలెంట్రీ అవార్డు పొందిన దేశభక్తుని గురించి అంశంపై వ్యాసం లేదా డ్రాయింగ్ వేయాల్సి ఉంటుంది.
- 6 - 8వ తరగతి విద్యార్థులు గ్యాలెంట్రీ అవార్డు పొందిన వారు దేశం కోసం చేసిన త్యాగం గురించి వివరిస్తూ.. 300 పదాలకు మించకుండా వ్యాసం లేదా డ్రాయింగ్ లేదా మల్టీ మీడియా ప్రదర్శన ఇవ్వాలి.
- 9 - 10వ తరగతి వారు రాణీ లక్ష్మీబాయి కలలోకి వస్తే.. నీవు దేశసేవ ఎలా చేస్తావు అనే అంశంతో 750 పదాల వ్యాసం లేదా డ్రాయింగ్, మల్టీమీడియా ప్రదర్శన పోటీలో పాల్గొనొచ్చు.
- ఇంటర్ విద్యార్థులు స్వాతంత్ర్య ఉద్యమంలో 1857 తిరుగుబాటులో నిన్ను ప్రేరేపించిన అంశంపై వెయ్యి పదాలకు వ్యాసం, చిత్రలేఖనం ద్వారా పోటీలో పాల్గొనవచ్చు.

ఎక్కువ దరఖాస్తులు వచ్చేలా చర్యలు




పోటీల కోసం వీలైనన్ని ఎక్కువ పాఠశాలల నుంచి దరఖాస్తులు వెళ్లేలా చూస్తున్నాం. ఇప్పటికే ఆయా పాఠశాలలకు సమాచారం ఇచ్చాం. సెలవులు ఉండటం వల్ల కావడం లేదు. పాఠశాలలు ప్రారంభం కాగానే నమోదు జరిగేలా చూస్తాం. దరఖాస్తు సమయం పొడిగించే అవకాశం ఉంది. **-ఎస్తేర్‌రాణి, జిల్లా సమన్వయ అధికారిణి, జోగులాంబ**

జనరిక్ దుకాణం.. ఉపాధికి మార్గం

మహిళా సంఘాల సభ్యులకు రుణ సదుపాయం





గద్వాల, న్యూస్‌టుడే: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమున్న ఔషధాలు దొరకవు. ప్రైవేటు మందుల దుకాణాలకు వెళ్తే అధిక ధరలకు విక్రయం. ఇలా పేద, మధ్య తరగతి ప్రజలు నలుగుతున్నారు. ఇందుకు ఉపశమనంగా కేంద్ర ప్రభుత్వ జనరిక్ దుకాణాలు ఏర్పాటుకు ప్రోత్సాహం అందించాలని నిర్ణయించి అమలు చేస్తోంది. అయితే ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో కొన్ని చోట్ల దుకాణాలున్నా అవగాహన అంతంత మాత్రంగానే ఉంది. మహిళా సంఘాల సభ్యులకు వీటి ఏర్పాటుకు ప్రోత్సాహం అందిస్తే ఉపాధితో పాటు రోగులకు తక్కువ ధరలకే ఔషధాలు లభిస్తాయని, వీటికి ప్రాచుర్యం కూడా లభిస్తుందని భావించి గతేడాది కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయించింది. రాష్ట్రంలో అమలు చేయాలని ఆదేశాలు ఇచ్చింది. కానీ ఆచరణలోనే అలక్ష్యం కనిపిస్తోంది.

మార్గదర్శకాలు ఇలా..

- మహిళా సంఘంలో సభ్యులై కొంతకాలం వారి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చు.
- తప్పనిసరిగా డీఫార్మసీ, బీఫార్మసీ, ఎంఫార్మసీ ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలి.
- షాపు ఏర్పాటు చేసేవారు కనీసం 120 గజాల స్థలాన్ని చూపించాలి.
- ఇప్పటికే అల్లోపతి మందుల దుకాణం ఉన్నవారు అదనంగా జనరిక్ దుకాణం ఏర్పాటుకు సైతం రుణం పొందవచ్చు.

రూ.3 లక్షల రుణం

మహిళా సంఘాల్లో సభ్యులై ఉన్న వారికి జనరిక్ ఔషధాల దుకాణం ఏర్పాటు చేసుకోవటానికి రూ.3 లక్షల రుణం ఇవ్వనుంది. అర్హులు ఎంతమంది ఉంటే అంతమందికీ రుణం ఇవ్వనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆసక్తి ఉన్నవారు దరఖాస్తులు చేసుకోవచ్చు. రుణాలు మంజూరుకు స్త్రీ నిధి నిబంధనలు సడలించారు. ఆసక్తి, అవగాహన ఉన్న మహిళా సంఘాల్లోని కుటుంబ సభ్యులు, బంధువులు ముందుకు వచ్చి దరఖాస్తులు చేసుకోవచ్చు. కానీ ఐకేపీ అధికారులు దీనిపై అవగాహన కల్పించటంలో ఆశించిన ప్రగతి కనిపించటం లేదు.

ఉమ్మడి జిల్లాకు 90 యూనిట్లు

దేశంలో జనరిక్ మందులకు ఆదరణ పెరుగుతోంది. మన జిల్లాలో సైతం ప్రజలు సరైన అవగాహన లేక వీటి పట్ల అనుమానాలు ఉండటం వల్ల వీటికి పూర్తి స్థాయి ఆదరణ లభించటం లేదు. ఈ మందులపై ప్రజల్లో అవగాహన పెంచటంతో పాటు మహిళలకు ఉపాధి కల్పించే విధంగా దుకాణాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనిపై అధికారులు విస్తృతంగా ప్రచారం చేయాల్సి ఉంది. సంఘంలో ఉన్న సభ్యులకు అవగాహన కల్పిస్తే ఉపాధి పొందే అవకాశం కలుగుతుంది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 90కి పైగా దుకాణాలు ఏర్పాటుకు అవకాశం ఉందని స్త్రీ నిధి పథకం పర్యవేక్షణ అధికారులు చెబుతున్నారు.

స్త్రీనిధి అధికారులను సంప్రదించి..

జిల్లాలో మహిళా సంఘాల్లో సభ్యులైన వారు వారి బంధువులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. పేద ప్రజలకు సరసమైన ధరలకు దీని వల్ల ఔషధాలు పొందే అవకాశం కల్పించినట్టవుతుంది. దరఖాస్తుల కోసం క్షేత్ర స్థాయిలో ఉన్న స్త్రీ నిధి అధికారులను సంప్రదిస్తే సరిపోతుంది.

ఖర్చు పెరిగినా.. వెనక్కి తగ్గట్లే!

ఉమ్మడి జిల్లాలో ఊపందుకున్న యాసంగి వేరుశనగ సాగు


హన్వాడ : నాయినోనిపల్లిలో వేరుశనగ విత్తనం వేస్తున్న రైతులు

న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ వ్యవసాయం

ఎకరా వేరుశనగ సాగు చేయాలంటే భారీగా ఖర్చు చేయాల్సి వస్తోంది. దుక్కి దున్నటం, విత్తనం కొనుగోలు, ఎరువులు, కలుపు మందులు, పురుగు మందులు, ఆ తర్వాత కోతలు.. ఇలా అన్నీ కలిపి కనీసం రూ.30వేల నుంచి రూ.40వేల పెట్టుబడి అవసరం. బాగా పండితే ఎకరాకు 12 క్వింటాళ్ల వరకు దిగుబడి రావచ్చు. చివరకు రైతులు మార్కెట్లో రూ.3వేల నుంచి రూ.4వేలకు క్వింటా చొప్పున అమ్మాల్సి వస్తోంది. ఒక్కోసారి పెట్టుబడి కూడా రాని పరిస్థితి. ఇన్ని తెలిసినా రైతులు యాసంగి పంటగా వేరుశనగ సాగుకే మొగ్గు చూపుతున్నారు.

అందని రాయితీ విత్తనం

ఉమ్మడి జిల్లాలో వర్షాలు బాగా కురవటంతో రైతులు వేరుశనగ సాగు చేస్తున్నారు. నారాయణపేట, మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని మద్దూరు, దౌల్తాబాద్, దామరగిద్ద, గండీడ్, మహమ్మదాబాద్, హన్వాడ, ధన్వాడ, నవాబుపేట, వనపర్తి కొల్లాపూర్, వీపనగండ్ల, పెద్దమందడి, పెబ్బేరు తదితర మండలాల్లో విత్తనాలు వేస్తున్నారు. ప్రభుత్వం రైతులకు రాయితీపై విత్తనాలు కూడా ఇవ్వటం లేదు. ఒక్కో రైతు విత్తనం కొనుగోలుకే భారీ మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోంది. మార్కెట్లో వ్యాపారులు క్వింటా విత్తనాన్ని రూ.12 వేల నుంచి రూ.13వేల వరకు ధరకు అమ్ముతున్నారు. గడిచిన వారంలో వ్యాపారులు క్వింటా విత్తనం ఏకంగా రూ.14 వేలకు అమ్మారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఈ పంటకు 14-35-14 ఎరువు వాడుతున్నారు. ఒక్కో బస్తా ఖరీదు రూ.1,700. ఒక్కో ఎకరాకు రెండు బస్తాలు వాడుతారు. కాడెద్దులు లేకపోవటంతో ట్రాక్టర్లతో విత్తనాలు వేసేందుకు కనీసం రూ.5వేలు వెచ్చిస్తున్నారు. కలుపు మందుకు రూ.1,200 వరకు ఖర్చు చేస్తున్నారు. నీటి తడులు అందించేందుకు డ్రిప్ పైపులు ఏర్పాటుచేస్తున్నారు. ఇందుకు రైతులు అప్పులు చేస్తున్నారు.

పంట చేతికి వచ్చేదాకా కష్టమే...

వేరుశనగ పంటకు అడవి పందుల బెడద ఎక్కువ. పంట కాపాడుకునేందుకు చలికాలమైనా రాత్రింబవళ్లు రైతులు కాపలాగా పొలంలోనే పడుకోవాలి. కొందరు రూ.వేలు ఖర్చు చేసి సోలార్ కంచెలు ఏర్పాటు చేసుకుంటున్నారు. నెమళ్లు, కుందేళ్లు, ఉడతలు, పక్షులు కూడా విత్తనం తినేస్తాయి. ఏమాత్రం ఆదమరచినా.. పందులు పంట మొత్తాన్ని పాడు చేస్తాయి. పంటను కాపాడేందుకు రైతుల కనీసం 110 రోజులు శ్రమించాలి. ఇన్ని రూపాల్లో ఖర్చు, శ్రమ పెరిగినా రైతులు ఒకరిని చూసి మరొకరు వేరుశనగ పంట సాగుకు సిద్ధపడుతున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 2.60 లక్షల ఎకరాల్లో పంటను సాగుచేసే అవకాశముందని మహబూబ్‌నగర్ జిల్లా వ్యవసాయాధికారి బి.వెంకటేశ్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ఖర్చుతో కూడుకున్న ఈ పంటకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, ఉలువలు, పప్పుశనగ, రాగి పంటలను సాగు చేసుకోవచ్చని సూచించారు.

పంట.. చెక్కుచెదరకుంట!


దానిమ్మ తోటకు కప్పిన గ్రో కవర్


ఆకర్షణీయంగా దానిమ్మ కాయలు

రైతులు పంట పండించటం ఒక ఎత్తయితే.. దాన్ని చీడపీడల నుంచి కాపాడుకోవడం మరో ఎత్తు. ఉద్యాన పంటల విషయంలో మరింత ఎక్కువ శ్రద్ధ తీసుకోవటం అవసరం. లేదంటే పెట్టిన పెట్టుబడి కూడా చేతికి రాదు. చిన్నచింతకుంట మండలం ఉంద్యాలకు చెందిన రైతు కోట్ల కృష్ణయ్య 8 ఎకరాల్లో దానిమ్మ తోట సాగుచేశారు. ఈ పంటకు చీడపీడల బెడద ఎక్కువ. పక్షులు, క్రిమి కీటకాలు, మంచు, ఎండల వల్ల కాయ నలుపుగా మారి నాణ్యత దెబ్బతిని సరైన ధర పలకదు. వాటి నుంచి పంటను రక్షించుకునేందుకు రైతు దానిమ్మ మొక్కలకు గ్రో కవర్ ఏర్పాటు చేశారు. తాను 8 ఎకరాల్లో సాగుచేసిన దానిమ్మ పంట మొత్తానికి ఏర్పాటు చేసేందుకు కిలో రూ.160 ధర చొప్పున రూ.1,750 చెల్లించి గ్రో కవర్ కొనుగోలు చేసినట్లు చెప్పారు. చీడపీడలు, పక్షులు దరి చేరకపోవడంతో చక్కని రంగు, నాణ్యతతో దానిమ్మ కాయలు ఆకర్షణీయంగా పెరిగాయని రైతు కృష్ణయ్య ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- ఈనాడు, మహబూబ్‌నగర్, న్యూస్‌టుడే, కొత్తకోట గ్రామీణం


ఆయుధ పూజకు ప్రత్యేక స్థానం

జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్


మహబూబ్‌నగర్ : ఆయుధ పూజ చేస్తున్న జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, చిత్రంలో ఎస్పీ డి.జానకి, అదనపు ఎస్పీ రాములు తదితరులు

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: దసరా పండగలో ఆయుధాలు, వాహనాల పూజలకు ప్రత్యేక స్థానం ఉందని జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ అన్నారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో దుర్గాష్టమి సందర్భంగా ఆయుధ పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ వ్యవస్థలో ప్రతి సభ్యుడు ఆయుధాన్ని గౌరవిస్తూ, బాధ్యతాయుతంగా తమ విధులు నిర్వహించాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. పోలీస్ వ్యవస్థలో ఇది సంప్రదాయమై, ప్రతి ఏడాది దసరా పండగ సమయంలో ఈ పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. పోలీస్ సిబ్బంది తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని, సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు తమ వంతు కృషి చేయాలన్నారు. ఉమ్మడి జిల్లా ప్రజలకు ఆయన దసరా పండగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ డి.జానకి, అదనపు ఎస్పీ రాములు, ఏఆర్ అదనపు ఎస్పీ సురేశ్‌కుమార్, డీఎస్పీలు వెంకటేశ్వర్లు, వెంకటరమణారెడ్డి, శ్రీనివాసులు, సీఐలు అప్పయ్య, గాంధీ, ఆర్ఏ అడ్మిన్ కృష్ణయ్య, ఎంటీవో నగేశ్, రమేశ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శరణ్మయీ.. శరణు!


శాంతినగర్‌లో అమ్మవారిని గురువారం దుర్గాదేవిగా అలంకరించారు.


కల్వకుర్తి: ముకురాలలో దుర్గామాత విగ్రహం వద్ద యువకులు


అచ్చంపేట: వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో నవదుర్గాదేవి అలంకరణలో అమ్మవారు


నవాబ్‌పేట : శ్రీమహ దుర్గాదేవిగా ఫతేపూర్ మైసమ్మ


కొత్తకోట : కానాయపల్లి శ్రీకోటిలింగేశ్వరాలయంలో దుర్గాదేవిగా జ్ఞానాంబికాదేవి

విజయదశమి సమీపిస్తుండటంతో నవరాత్రి ఉత్సవాలు ఊపందుకుంటున్నాయి. పట్టణాలు, పల్లెల్లోని ఆలయాల్లో అమ్మవారు రోజుకో రూపంలో దర్శనమిస్తున్నారు. దసరా సందర్భంగా బతుకమ్మ సంబరాలు అంబరమంటుతున్నాయి. మహిళలు బతుకమ్మలను పేర్చి ఉత్సాహంగా ఉత్సవాల్లో పాల్గొంటున్నారు. **-న్యూస్‌టుడే బృందం**


గద్వాల తేరుమైదానంలో బతుకమ్మ పాటకు నృత్యం చేస్తున్న మహిళలు


మహబూబ్‌నగర్: బ్రాహ్మణవాడలోని వాసవీమాత ఆలయంలో మహిషాసురమర్ధని అలంకరణలో..

హామీల అమలుపై నిలదీయండి: ఎంపీ


హన్వాడలో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

హన్వాడ, న్యూస్‌టుడే: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై కార్యకర్తలు, ప్రజలు ప్రభుత్వాన్ని నిలదీయాలని ఎంపీ డీకే అరుణ సూచించారు. గురువారం మండల కేంద్రంలో, గుడిమల్కాపూర్, బుద్ధారం గ్రామాల్లో నిర్వహించిన భాజపా సభ్యత్వ కార్యక్రమంలో ఆమె పాల్గొన్ని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఆరు గ్యారంటీలతో హామీ లిచ్చిందని వాటిల్లో ఒకటి తప్పా మిగతావి పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత ఏర్పడిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో అందించిన విజయాన్ని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి కార్యకర్త వంద మందికి, మండల నాయకుడు ఐదు వందల మందికి పార్టీ సభ్యత్వం కల్పించాలన్నారు. తద్వారా వచ్చే స్థానిక ఎన్నికల్లో మళ్లీ భాజపా విజయం సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. సమస్యల సాధనకు భాజపా కార్యకర్తలు నిరంతరం శ్రమించాలన్నారు. హన్వాడ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఎన్నికల్లో హన్వాడ నుంచి మంచి మెజార్టీ ఇచ్చిన కార్యకర్తలకు, ప్రజలకు ఎంపీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి కె.బుచ్చిరెడ్డి, ఉపాధ్యక్షుడు కృష్ణవర్ధన్‌రెడ్డి, నాయకులు నారాయణ యాదవ్, రతంగ పాండురెడ్డి, మండలాధ్యక్షుడు వెంకటయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కారు దగ్ధం


మాగనూరు శివారులో కాలిపోతున్న కారు

మాగనూరు, న్యూస్‌టుడే : నారాయణపేట జిల్లా మాగనూరు వద్ద గురువారం ఉదయం ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొని కారు దగ్ధమైంది. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో మంత్రాలయం వెళ్తుండగా ఉదయం ఆరు గంటల సమయంలో కారు అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టింది. ఆ సమయంలో కారులో నలుగురు పెద్దవారు, ముగ్గురు చిన్న పిల్లలు ఉన్నారు. అందరూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే కారులో ఉన్న వారంతా దిగి పక్కకు వచ్చిన తర్వాత షార్ట్ సర్క్యూట్ జరిగి కారులో మంటలు చెలరేగాయి. వెంటనే 100కు డయల్ చేయడంతో అగ్నిమాపక దళ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. మాగనూరు పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు.

చిరుత మృతిపై అన్ని కోణాల్లో దర్యాప్తు


చిరుత మృతదేహానికి డీఎఫ్‌వో సమక్షంలో పోస్టుమార్టం చేస్తున్న పశువైద్యులు

కొల్లాపూర్, న్యూస్‌టుడే : నల్లమలలోని అమరగిరి అటవీ ప్రాంతంలో చిరుత మృతిపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు డీఎఫ్‌వో రోహిత్ గోపిడి చెప్పారు. బుధవారం సాయంత్రం చిరుత మృతదేహానికి డీఎఫ్‌వో సమక్షంలో పోస్టుమార్టం చేసి పూడ్చిపెట్టారు. ఈ సంఘటనపై ఆయన గురువారం మాట్లాడుతూ...ప్రస్తుత నివేదిక ప్రకారం అనారోగ్య సమస్యలతోనే చనిపోయినట్లు తెలుస్తోందన్నారు. అయినా కాలిగోర్లు, పన్ను, కాలేయం తదితర అవయవాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు చెప్పారు. నిఘా మరింత పెంచామని, అటవీ సంరక్షణకు కొల్లాపూర్ రేంజ్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. ఎఫ్‌డీవో తిరుమలరావు సైతం కొల్లాపూర్‌లో సిబ్బందితో సమావేశమై పరిస్థితిని సమీక్షించినట్లు సమాచారం.

చికెన్ ధరలు

ఫాంరేటు	109–00
రిటైల్	131–00
డ్రెస్డ్	190–00
స్కిన్‌లెస్	216–00

తెరపై ఈనాడు

శ్రీనివాస: దేవర, వెంకటేశ్వర: మార్టిన్ (ఉదయం, సెకండ్‌షో), మా నాన్న సూపర్ హీరో (మ్యాట్నీ, ఫస్ట్‌షో)
శ్రీరామ: వేట్టయన్ –న్యూస్‌టుడే, వనపర్తి న్యూటౌన్

ఆలయాలను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాల్ దంపతులు

అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ ఆలయాలను గురువారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈవీ.వేణుగోపాల్ దంపతులు దర్శించుకున్నారు. అర్చకులు, ఈవో పురేందర్, ఛైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ధర్మకర్త సభ్యులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామి వారికి అభిషేకం, జోగులాంబ అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి శేషవస్త్రాలతో సత్కరించి వేద ఆశీర్వచనం చేశారు. అలంపూర్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కవిత, కోర్టు సిబ్బంది వెంట ఉన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: జిల్లాలోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో వయోజన విద్యపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో 15 ఏళ్లు పైబడిన వారు 17 వేలకు పైగా ఉన్నారన్నారని వారికి అక్షరాలు నేర్పించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్, వయోజన విద్యా జిల్లా అధికారి శ్రీనివాస్‌రెడ్డి, డీఈవో గోవిందరాజులు, డీపీవో సురేశ్, పుర కమిషనర్ పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర కార్యవర్గంలో చోటు

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర కార్యవర్గంలో పెబ్బేరు మండల ఉపాధ్యాయులకు చోటు దక్కిందని పీఆర్టీయూటీఎస్ మండల అధ్యక్షుడు చిన్నరాములు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా నరసింహ గౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఈశ్వర్‌రెడ్డి, మహేశ్, అశోకవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శిగా దయానంద్, రాష్ట్ర మహిళా కార్యదర్శిగా షర్మిష్ఠదేవిని ఎన్నుకున్నారని పేర్కొన్నారు.

శ్రీరంగాపురం, న్యూస్‌టుడే : పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర కార్యవర్గంలో మండలానికి చెందిన ఉపాధ్యాయులకు చోటు దక్కినట్లు మండలాధ్యక్షుడు వసంతపురం.రాజు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా రామచంద్రయ్య, శివశంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నాగేశ్వర్‌రెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా జయంత్‌రెడ్డి ఎన్నికైనట్లు పేర్కొన్నారు.

డీఎస్సీ విజేతకు సన్మానం

పెబ్బేరు, న్యూస్‌టుడే : మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన ఓంకార్ అనే యువకుడు డీఎస్సీలో ఉద్యోగం సాధించడంతో గురువారం గ్రామస్థులు సన్మానించారు. ఓంకార్ మొదట కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించారు. అనంతరం రైల్వేలో గ్రూప్ డి ఉద్యోగం పొందారు. ఇటీవల డీఎస్సీలో ఎస్జీటీ ఉద్యోగం సాధించినట్లు గ్రామస్థులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మల్లికార్జున్, లక్ష్మన్న, గోకారి, మూర్తి, శివ, కొండల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా రాము

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: బహుజన విద్యార్థి సమాఖ్య (బీఎస్ఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వనపర్తి జిల్లా వీపనగండ్లకు చెందిన తోలు రాము నియమితులయ్యారు. బుధవారం బీఎస్ఎఫ్ వ్యవస్థాపకుడు పిడమర్తి రవి నుంచి నియామక పత్రం అందుకున్నట్లు రాము తెలిపారు. విద్యార్థుల సమస్యలపై పోరాడుతూ బీఎస్ఎఫ్ బలోపేతానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

సరకులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : నిత్యావసర సరకులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి సత్యనారాయణ హెచ్చరించారు. పట్టణంలోని పలు కిరాణా దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఓ దుకాణంలో నూనె ప్యాకెట్‌పై ఎమ్మార్పీ ధర కనిపించకపోవడంతో రూ.5 వేలు జరిమానా విధించారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

చీకటిని జయించి.. కొలువు సాధించి

కొత్తకోట, న్యూస్‌టుడే: మండలంలోని ముమ్మళ్లపల్లె గ్రామానికి చెందిన విష్ణు తండ్రి ద్వారా సంక్రమించిన రేచీకటిని అధిగమిస్తూ ఉపాధ్యాయ ఉద్యోగం సాధించారు. బ్రెయిలీ లిపిలో డిగ్రీ, టెట్, బీఈడీ, ఎంఏ పూర్తి చేసి 2024 డీఎస్సీలో ర్యాంకు దక్కించుకుని సాంఘిక శాస్త్రంలో స్కూల్ అసిస్టెంట్‌గా నియమితులయ్యారు. ముఖ్యమంత్రి నుంచి నియామక పత్రం అందుకోవడాన్ని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ప్రభుత్వ విశ్రాంత వైద్యుడు కృష్ణకుమార్‌రెడ్డి ప్రేరణతో ఉద్యోగం సాధించినట్లు విష్ణు తెలిపారు.

గెలుపోటములు సమానంగా తీసుకోవాలి



కొత్తకోట : విజేతలతో సీఐ

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : ఆటల్లో గెలుపోటములు సహజమని, వాటిని సమానంగా తీసుకొని ముందుకు సాగాలని సీఐ రాంబాబు అన్నారు. దసరా సందర్భంగా ఆరోగ్య క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో కొత్తకోటలో అయిదు రోజులుగా నిర్వహించిన క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. పోటీల్లో సాయికుమార్‌రెడ్డి జట్టు విజయం సాధించగా సీఐ ముఖ్య అతిథిగా హాజరై విజేత జట్టుకు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై మంజునాథరెడ్డి, నిర్వాహకులు శేఖర్‌గౌడ్, లక్ష్మిరెడ్డి, శివ, నవీన్, ఆంజనేయులు, బాలకృష్ణ పాల్గొన్నారు.

పెబ్బేరు: దసరా పండగ సందర్భంగా మండలంలోని బునియాదిపురంలో గురువారం గ్రామ యూత్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. గ్రామ పెద్దలు వనం రాములు యాదవ్, మల్లేశ్ యాదవ్, విజయగౌడ్, ఆంజనేయులు పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పింఛన్లకు ఎదురుచూపులు

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : పింఛన్ల కోసం అర్హులైన దివ్యాంగులు ఎదురుచూస్తున్నారు. సదరం పత్రాలతో దరఖాస్తు చేసుకున్న వారు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మంజూరు చేసి ఆసరా కల్పించాలని వేడుకుంటున్నారు. 2022 ఆగస్టులో కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. అప్పటి నుంచి మంజూరు చేయలేదు. జిల్లాలో 11,609 మంది దివ్యాంగ పింఛన్లు పొందుతున్నారు.

రెండేళ్లుగా ప్రతిష్టంభన..

ఆసరా పింఛను కోసం దివ్యాంగులు సదరం శిబిరానికి హాజరయ్యేందుకు ఆధార్ కార్డుతో స్లాట్ బుక్ చేసుకోవాలి. వారికి కేటాయించిన రోజు శిబిరానికి హాజరైతే వైద్యులు పరీక్షించి వికలత్వం నిర్ధారించి, ధ్రువపత్రం జారీ చేస్తారు. 40 శాతానికి పైగా వికలత్వం ఉన్న వారు పింఛనుకు అర్హులు. సదరం ధ్రువపత్రంతో ఆయా మండల పరిషత్తుకు కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అక్కడ ఆన్‌లైన్‌లో నమోదు చేసి డీఆర్డీఏ కార్యాలయానికి పంపిస్తారు. అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేస్తారు. రెండేళ్లుగా పింఛన్ల మంజూరు నిలిచిపోయింది. క్రమం తప్పకుండా సదరం ధ్రువపత్రాలు జారీ అవుతున్నా పింఛన్లు మంజూరు కావడం లేదు.

పట్టించుకోవడం లేదు



2022 సంవత్సరంలో అధికారులు సదరం ధ్రువీకరణ పత్రం ఇచ్చారు. ఈ పత్రంతో పింఛనుకు దరఖాస్తు చేసుకున్నా. మంజూరు కాలేదని ఎంపీడీవో కార్యాలయం చుట్టూ తిరిగినా అధికారులు పట్టించుకోవడం లేదు. **- జ్యోతిక, గోపాల్‌పేట**

అధికారులు ఆదుకోవాలి



75 శాతం వికలత్వం ఉన్నట్లు 2022లో అధికారులు ధ్రువీకరించారు. పింఛను మంజూరు కాలేదు. నేను, నా భార్య చెన్నమ్మ కూలీపని చేసి జీవనం సాగిస్తున్నాం. అధికారులు పింఛను మంజూరు చేసి ఆదుకోవాలి. **- మద్దిలేటి, కనిమెట్ట, కొత్తకోట**

రేపుమాపంటున్నారు..



పక్షవాతంతో పని చేయలేకపోతున్నా. కుటుంబసభ్యులపై ఆధార పడి ఉన్నా. పింఛను కోసం అధికారులను అడిగితే రేపు మాపంటూ అంటున్నారే.. తప్ప మంజూరు చేయడం లేదు. దయ ఉంచి మంజూరు చేయాలి. **- సహదేవుడు, గుంటిపల్లి, ఆత్మకూరు**

అనుమతులు వచ్చిన వెంటనే మంజూరు చేస్తాం

దివ్యాంగుల సదరం ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. ప్రభుత్వం నుంచి అనుమతి రావాల్సి ఉంది. అనుమతి వచ్చిన వెంటనే పింఛన్లు మంజూరు చేస్తాం. **- ఉమాదేవి, డీఆర్డీవో వనపర్తి**

పొలంలో మొసలి



నాగసానిపల్లిలో తాళ్లతో బంధించిన మొసలి

శ్రీరంగాపురం, న్యూస్‌టుడే : మండలంలోని నాగసానిపల్లెలో మొసలి పట్టుబడింది. గ్రామానికి చెందిన నర్సింహనాయుడు గురువారం ఉదయం పొలానికి వెళ్లగా.. వరి పొలంలో మొసలిని గమనించి సహచర రైతులతో కలిసి తాళ్లతో బంధించి అటవీశాఖ సెక్షన్ అధికారిణి రాణికి సమాచారం అందించారు. ఐదు అడుగుల పొడవు, 55 కిలోల బరువు ఉంటుందని ఆమె తెలిపారు. వాహనంలో తీసుకెళ్లి బీచుపల్లి వద్ద కృష్ణానదిలో వదిలారు. సమీపంలోని జూరాల కాలువ నుంచి మొసలి వచ్చినట్లు భావిస్తున్నారు. రైతులు, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఆమె సూచిస్తున్నారు.

జూరాలకు తగ్గుతున్న వరద

ధరూరు, న్యూస్‌టుడే: జూరాల జలాశయంలోకి వరద తగ్గుతోంది. జలాశయంలోకి గురువారం సాయంత్రానికి 19,600 క్యూసెక్కుల వరద చేరుతోంది. జలవిద్యుదుత్పత్తి కోసం 22,801 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. జలాశయంలో నీటినిల్వ 9.296 టీఎంసీల మేర ఉంది. ఎత్తిపోతల పథకాలకు నీటితోడి పోత నిలిపివేశారు. కుడి, ఎడమ కాల్వలకు మాత్రం 1700 క్యూసెక్కులు వదులుతున్నారు. ఆదివారం నాటికి జూరాల వరద వెయ్యి టీఎంసీలు దాటనుంది. కర్ణాటకలోని ఆలమట్టి జలాశయంలోకి 25 వేల క్యూసెక్కుల వరద చేరుతోంది. వచ్చిన వరదను దిగువకు వదులుతున్నారు. నారాయణ్‌పూర్ జలాశయంలోకి 24వేలు చేరుతుండగా దిగువకు 16,500 క్యూసెక్కులు వదులుతున్నారు.



వనపర్తి రాయిగడ్డ కాలనీలో..



కండక్టర్ కాలనీలో..



రాంనగర్ కాలనీలో..



కరెమ్మగుడిలో..



కొత్తకోట కన్యకాపరమేశ్వరి ఆలయంలో..



భవానీ శంకర ఆలయంలో..



పెబ్బేరు కన్యకా పరమేశ్వరి ఆలయంలో..



పెబ్బేరు చిన్న చౌడేశ్వరి ఆలయంలో



గాజులతో వాసవీమాత అలంకరణ

అపురూపం.. దుర్గాదేవి రూపం

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లాలో ఆయా చోట్ల ప్రతిష్ఠించిన మండపాల్లో అమ్మవారు దుర్గాదేవి రూపంలో దర్శనమిచ్చారు. భక్తులు జగజ్జేతకు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. దుర్గాదేవి కుంకుమార్చనలో మహిళలు, యువతులు పాల్గొన్నారు. అమ్మవారిని పూజిస్తే.. ఆయురారోగ్యాలు కలుగుతాయని అర్చకులు తెలిపారు. మధ్యాహ్నం అన్నప్రసాదం, రాత్రి అల్పాహార ప్రసాద వితరణ, భజన, బతుకమ్మ నృత్యాలు, కోలాటాలు కొనసాగాయి. అమరచింత శ్రీ విఘ్నేశ్వర భవానీనగర్ మండపంలో దుర్గమ్మను రూ. 2,02,116తో అలంకరించారు. వనపర్తి గాంధీనగర్‌లో ఇండియన్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, నెహ్రూ కమ్యూనిటీ హాలులో ఆయన సతీమణి వాసంతి పూజలు చేశారు. – న్యూస్‌టుడే, బృందం





ఆత్మకూరులో కన్యకాపరమేశ్వరి ఆలయంలో.. తాటిపాములలో..



అమరచింతలో..



వనపర్తి: పూజల్లో మాజీమంత్రి సతీమణి వాసంతి, భక్తులు



ఆత్మకూరు కేశవనగర్ ఆంజనేయస్వామి ఆలయంలో..



ఆత్మకూరు పూజల్లో ఆర్యవైశ్యులు



గోపాల్‌పేటలో..

మానసిక ప్రశాంతతతో ఆరోగ్యం

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : మానసిక ప్రశాంతతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి వి.రజని అన్నారు. గురువారం వనపర్తి జిల్లా కోర్టు ఆవరణలో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు హాజరైన ఆమె మాట్లాడారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని పెద్దలు సూచించిన మార్గాన్ని అవలంబించాలన్నారు. జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి రవికుమార్, మానసిక వైద్యురాలు పుష్పలత ఆరోగ్యం గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు మోహన్‌కుమార్ యాదవ్, డీఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బంది శ్రీనివాసులు, మల్లేశ్, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే: రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మేఘారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఖిల్లా గణపురంలోని ప్రాథమిక సహకార పరపతి సంఘం నూతన భవనం ప్రారంభోత్సవం సందర్భంగా పద్మశాలి కల్యాణ మండపంలో పీఏసీఎస్ అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని పేర్కొన్నారు. రైతు భరోసా త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. ఖిల్లాగణపురంలో డీసీసీబీ ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. నూతన పీఏసీఎస్ భవనం ఏర్పాటు సందర్భంగా రూ.కోటి రుణాలను అందజేశారు. అంతకుముందు ఎమ్మెల్యే ఆగారం గ్రామంలో రూ.9.45 లక్షలతో నిర్మించిన ప్రాథమిక పాఠశాల అదనపు గదులను, వెంకటాంపల్లిలో రూ.10 లక్షలతో నిర్మించిన సగర సంఘం భవనాలను ప్రారంభించారు. అనంతరం ఖిల్లాగణపురం నుంచి సల్కెలాపురం మీదుగా హైదరాబాద్‌కు బస్సును ప్రారంభించి, సల్కెలాపురం వరకు బస్సు నడిపారు. సల్కెలాపురం, మామిడిమాడ గ్రామాల్లో దుర్గామాతను దర్శించుకున్నారు. కార్యక్రమంలో వనపర్తి మార్కెట్‌యార్డు అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు మహేశ్, సింగిల్‌విండో ఉపాధ్యక్షుడు క్యామరాజు, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ తేనేటి రవీందర్‌రెడ్డి, డైరెక్టర్లు సాయిచరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళను హత్య చేసిన వ్యక్తి అరెస్టు

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: ఓ మహిళను హత్య చేసిన సంఘటనలో నిందితుడు బి.ప్రభాకర్‌ను గురువారం అరెస్టు చేశామని ఎస్సై జలేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 8న గోపాల్‌పేట మండలం ధర్మాతండా శివారు పాటిగడ్డతండాకు చెందిన శాంతమ్మ వనపర్తికి వచ్చారు. గాంధీచౌక్‌లోని ఓ మద్యం దుకాణంలో బి.ప్రభాకర్‌తో పాటు ఆమె మద్యం తాగారు. అనంతరం ఇద్దరు కలిసి ద్విచక్ర వాహనంపై మండలంలోని చిమనగుంటపల్లి గ్రామ శివారులోని ఓ బావి వద్దకు వెళ్లారు. వారి మధ్య డబ్బుల విషయంలో వివాదం జరిగింది. శాంతమ్మను బావిలోకి తోసి ఆమె చనిపోయిన అనంతరం ద్విచక్ర వాహనంపై నిందితుడు వనపర్తికి వెళ్లినట్లు ఎస్సై తెలిపారు. బావిలో తోసే క్రమంలో నిందితుడి ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్సు పడిందని చెప్పారు. గురువారం అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని ఒప్పుకొన్నట్లు పేర్కొన్నారు. వనపర్తి కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచినట్లు తెలిపారు.

మోసం, అట్రాసిటీ కేసు నమోదు

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: ఓ వ్యక్తిపై మోసం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైనట్లు వనపర్తి పట్టణ రెండో ఎస్సై రామరాజు తెలిపారు. చికెన్ వ్యర్థాల సేకరణ టెండరు దక్కేలా చూస్తానని, పుర అధికారులకు డబ్బులివ్వాలని పట్టణానికి చెందిన ఆంజనేయులుతో వనపర్తికి చెందిన యం.డి.ఖలీల్ ఒప్పందం చేసుకున్నట్లు పేర్కొన్నారు. బాధితుడు ఫోన్‌పే ద్వారా రూ.1.90 లక్షలు పలు పర్యాయాలు ఇచ్చినట్లు వెల్లడించారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు యం.డి.ఖలీల్‌పై మోసం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వాహన చోదకుడిపై..

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : మండలంలోని రంగాపురం గ్రామ శివారులో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదానికి కారణమైన వాహన చోదకుడిపై గురువారం కేసు నమోదు చేశామని ఎస్సై హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. గద్వాల మండలం చెనుగోనిపల్లి గ్రామానికి చెందిన 15 మంది ఖిల్లాగణపురం మండలం ఉప్పర్‌పల్లి గ్రామానికి వెళ్లి వస్తుండగా పెబ్బేరు మండలం రంగాపూర్ గ్రామ శివారులో జాతీయ రహదారిపై వాహనాన్ని అతి వేగంగా, అజాగ్రత్తగా నడిపి ఇద్దరి మృతికి, 13 మందికి గాయాలకు కారణమైన ట్రాలీ ఆటో వాహన చోదకుడు హనుమంతుపై బాధిత కుటుంబ సభ్యుడు బోయ వెంకటేశ్ ఫిర్యాదు మేరకు నమోదు చేశామని పేర్కొన్నారు.

యువకుడి అదృశ్యం

శంషాబాద్, న్యూస్‌టుడే: శంషాబాద్ మండలంలో ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. శంషాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా అప్పారెడ్డిపల్లికి చెందిన వెంకటయ్య, అలివేలు దంపతులు రోజువారీ కూలీలు. ఉపాధి కోసం ఇటీవల కుమారుడితో కలిసి శంషాబాద్‌కు వచ్చి తొండుపల్లిలో ఉంటున్నారు. ఈ నెల 1న వారి కుమారుడు జగదీశ్ స్వగ్రామానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయల్దేరి అదృశ్యమయ్యాడు. తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఆచూకీ దొరకలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదుతో గురువారం పోలీసులకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తప్పిన ప్రమాదం

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం ఆటోను టెంపో ఢీకొంది. కనిమెట్టకు చెందిన ఆటో కొత్తకోట నుంచి గ్రామానికి వెళ్తుండగా కర్నూలు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న టెంపో ఢీకొట్టింది. ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. తృటిలో పెను ప్రమాదం తప్పింది.

సమాజ హితమే ఆర్ఎస్ఎస్ లక్ష్యం



మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచారక్ దేవేందర్‌జీ

కొత్తకోట, న్యూస్‌టుడే: సమాజ హితం కోరుతూ హిందుత్వ సంఘటన కోసం ఆర్ఎస్ఎస్ కృషి చేస్తోందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ విభాగ్ ప్రచారక్ దేవేందర్‌జీ పేర్కొన్నారు. గురువారం పట్టణంలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాన్ని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. తిమ్మన్న యాదవ్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. దేశాన్ని, సమాజాన్ని రక్షించే దిశగా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు నడుం బిగించాలని సూచించారు. విదేశీ శక్తుల సహకారంతో సమాజ విభజన పనిలో కొన్ని సంస్థలు పని చేస్తున్నాయని సంఘటితంగా వాటిని ఎదుర్కోవాలని పేర్కొన్నారు. రానున్న 25 ఏళ్లలో భారత దేశాన్ని విశ్వగురువుగా చూపేందుకు పరివర్తన అవసరమన్నారు. పంచ భూతాలను పట్టి పీడిస్తున్న సమస్యల పరిష్కారానికి స్వయం సేవకులు కృషిచేయాలని కోరారు. అంతకు ముందు పట్టణంలో పథ సంచలన్, అనంతరం సభ జోరు వర్షంలో కొనసాగింది. సంఘ చాలక్ మురళీధర్‌రెడ్డితో పాటు స్వయం సేవకులు పాల్గొన్నారు.

నేడు ఆత్మకూరులో ఆర్ఎస్ఎస్ పథ సంచలన్

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ఆత్మకూరు పట్టణంలో శుక్రవారం సాయంత్రం ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని పథ సంచలన్ నిర్వహిస్తున్నామని బాధ్యులు భగవంత్‌రెడ్డి, నర్సింహరెడ్డి, మ్యాడం శ్రీనివాసులు తెలిపారు. స్థానిక సరస్వతి శిశుమందిర్ నుంచి పట్టణ ప్రధాన రహదారుల మీదుగా కొనసాగే ఈ కార్యక్రమానికి స్వయం సేవకులు హాజరు కావాలని కోరారు.

చట్టాలు వినియోగించుకోవాలి

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : ప్రజల అవసరాల నిమిత్తం ప్రభుత్వం తీసుకువచ్చే చట్టాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని లోక్ అదాలత్ డిఫెన్స్ కౌన్సిల్ బాలనాగయ్య అన్నారు. గురువారం శ్రీనివాసపురంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాలనాగయ్య మాట్లాడారు. లోక్ అదాలత్ ఆధ్వర్యంలో పేదలు, వృద్ధులు, మహిళలకు ఉచితంగా న్యాయ సేవలు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కృష్ణయ్య, ఆంజనేయులు, రఘు, సఖి కేంద్ర నిర్వాహకురాలు కవిత పాల్గొన్నారు.

చెరుకు రైతుల సమస్యలు పరిష్కరించండి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : కృష్ణవేణి చక్కెర కర్మాగారం యాజమాన్యం చెరకు రైతుల సమస్యల పరిష్కారానికి స్పందించాలని ఉమ్మడి జిల్లా చెరకు రైతుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం మధ్యాహ్నం జరిగిన ఆత్మకూరు జోన్ చెరకు రైతుల సర్వసభ్య సమావేశంలో సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజన్న మాట్లాడారు. కోత కూలి, రవాణా ఛార్జీలతో నిమిత్తం లేకుండా టన్నుకు రూ.3,500 చెల్లించాలని, వేరు పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలని, అధిక దిగుబడి ఇచ్చే చెరకు రకాల విత్తనాన్ని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు బి.రాజు, అరుణ్‌కుమార్, భగవంత్ రెడ్డి, రంగారెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

భగీరథ నీటి సరఫరాలో సమస్యలు రానీయొద్దు



మాట్లాడుతున్న మిషన్ భగీరథ జిల్లా ఎస్ఈ వెంకటరమణ

మదనాపురం, న్యూస్‌టుడే : గ్రామాల్లో మిషన్ భగీరథ తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా క్షేత్ర స్థాయిలో సిబ్బంది బాధ్యత వహించాలని మిషన్ భగీరథ జిల్లా ఎస్ఈ వెంకటరమణ అన్నారు. 17 పంచాయతీల పరిధిలోని మల్టీపర్పస్ సిబ్బంది, తాగునీటి సిబ్బందికి మోటార్ల మరమ్మతులపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. తాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించేకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న సిబ్బందికి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఈఈ జైపాల్‌రెడ్డి, ఎంపీడీవో ప్రసన్నకుమారి, ఏఈఈ శివానంద్, రుకేందర్ రెడ్డి, వినోద్‌కుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.